



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

సమన్వయంతో ముందస్తు చర్యలు

- జడ్‌పి ఛైర్మన్ పాపిరెడ్డి - పనులు చేసినా బిల్లులు ఆపడమేంటి నందికొట్కూరు ఎమ్మెల్యేపై జూపాడుబంగ్లా జడ్‌పిటిసి ఆగ్రహం - రోడ్డు బాగు చేస్తే కేసులు నమోదు చేస్తారా : ఛైర్మన్ - స్థాయి సంఘాల సమావేశంలో జడ్‌పిటిసిల ఆవేదన

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఏదైనా సమస్య జరిగినప్పుడు మాత్రమే అన్ని శాఖల అధికారులు స్పందించడం కాదని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమన్వయం చేసుకుని ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. శనివారం జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశం జిల్లా పరిషత్ సిఇఒ సమక్షంలో ఛైర్మన్ పాపిరెడ్డి అధ్యక్షతన గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, విద్య, వైద్యం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, ఆర్థిక ప్రణాళిక, పనులు అంశాలపై జిల్లా అధికారులు జడ్‌పిటిసి సభ్యుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ చాబోలు గ్రామంలో తాగు నీటి సమస్య వచ్చిందని జిల్లా అధికార యంత్రాగం హడావిడి చేయడం కాదని, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే అలాంటి సమస్యలు రాకుండా ఉండేదన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎన్ని తాగునీటి ట్యాంకులు ఉన్నాయి, కనీసం శుభ్రం చేయలేని ట్యాంకులు ఎన్ని అలాంటి వాటిపై తక్షణమే చర్యలు తీసుకుని తాగునీరు కలుషితం కాకుండా తక్షణం జాగ్రత్తలు పాటించాలన్నారు. దీనిపై అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ మాట్లాడుతూ ఆ దిశగా చర్యలు తీసుకుంటామని ఇప్పటికే 75 ట్యాంకులు గుర్తించామని శుభ్రం చేసే చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవుకు తాడిపత్రి రోడ్‌లో తుమ్మల పెంట గ్రామంలో అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ వారు గ్రామాల ప్రజల వినతితో రూ.75 లక్షలతో ఒక కిలో మీటర్ రోడ్డు వేస్తే వారిపై కేసులు నమోదు చేయడం ఎంతవరకు సరైందని ఆర్‌అండ్‌బి అధికారులపై ఛైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి తెలియక చేసినా ప్రజలకు మంచి జరిగిందని, నోటీస్ ఇవ్వాల్సింది లేదా అలా చేయకుండా వారికి చెప్పాల్సిందని, మరెక్కడా అలాంటి అభివృద్ధి జరగకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ఎఫ్ఐఆర్ కాపీలను టెండర్ పత్రాలను చూపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. తరువాత నిర్వహించే స్థాయి సంఘం సమావేశం లోపు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ వెనక్కి తీసుకోవాలని లేకుంటే మళ్ళీ దానిపై అడుగుతామన్నారు. ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ మాట్లాడుతూ వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఇరిగేషన్ అధికారులు వర్షాభావ పరిస్థితులు ఉన్నా ఎక్కడ ఒక ఎకరా పంట ఎండకుండా నీటిని అందించారని తెలిపారు. జూపాడుబంగ్లా జడ్‌పిటిసి జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలో తీర్మానం చేసి పూర్తయిన పనులకు బిల్స్ చేయకుండా నందికొట్కూరు ఎమ్మెల్యే అధికారులకు అడ్డుతగలడం సరైంది కాదన్నారు. తీర్మానం చేసి టెండర్లు ఉన్నవాటిని ఎలా నిలుపుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని అధికారులు బదులిచ్చారు. చేసిన పనులకు బిల్స్ ఇవ్వకుంటే నీరు చెట్టుపనులకు కోర్టుకు వెళ్లినట్టు ఇప్పుడు అందరం కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుందని జడ్‌పిటిసిలు ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం భోజన పథకంలో రాజకీయాలు చేసి వారిని అడ్డుకోవడం వల్ల గ్రామాల్లో కక్ష్యలు పెరిగి చంపుకునే దాకా వెళ్తారని జడ్‌పిటిసిలు తెలిపారు. సామరస్య ధోరణిలో అందరం వ్యవహరించాలని అన్నారు. ఈ స్థాయి సంఘాల సమావేశంలో జడ్‌పిటిసిలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఎఫ్ఆర్ఐ కాపీని చూపుతున్న జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



సమావేశానికి హాజరయిన అధికారులు, ప్రజాప్రతినిధులు

గుడికంబాళి నుంచి ఇసుక రవాణా

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా
- ఎస్పీతో కలిసి జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 8 నుండి ఉచిత ఇసుక విధానం అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. 8వ తేది నుండి కౌతాళం మండలం గుడికంబాళి స్టాక్ పాయింట్ నుండి ప్రజల అవసరార్థం ఇసుక రవాణాను ప్రారంభించాలని ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మిని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పి కృష్ణకాంత్ తో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డిఎల్ఎస్‌సి) సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉచిత ఇసుక విధానాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గుడికంబాళి స్టాక్ పాయింట్‌లో ఇప్పటివరకు 29,351 టన్నులు ఇసుక నిల్వ ఉందని పేర్కొన్నారు. గుడికంబాలి స్టాక్ పాయింట్ లో అందుబాటులో ఉన్న స్టాక్‌ను వెంటనే కౌతాళం తహశీల్దార్ పంచనామా చేసుకొని హ్యాండ్ ఓవర్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిడి మైన్స్, కౌతాళం తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇసుక డిపో వద్ద విఆర్‌ఎ, విఆర్‌ఒలను ఇన్‌ఛార్జులుగా నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇసుక రవాణా వివరాలను తనకు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. సి.బెళగల్ మండలంలో 5 డీసిల్టింగ్ పాయింట్లు, కొత్తకోట, కె.సింగవరం, ఈర్లదిన్నె, గుడుమాల, పల్లెదొడ్డి ఉన్నాయని, వాటికి పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నుండి క్లియరెన్స్ ఇచ్చిన వెంటనే వాటిని కూడా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆ మేరకు క్లియరెన్స్ వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మైన్స్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి డీసిల్టింగ్ పాయింట్ వద్ద ఒక ఇన్‌ఛార్జిని నియమించాలని కలెక్టర్ కర్నూలు ఆర్‌డిఒను ఆదేశించారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డిఎల్ఎస్ఇ)చే ఇసుక టన్నుకు రూ.335 నిర్ణయించామన్నారు. రేవుల్లో ఇసుక తవ్వకం, లోడింగ్, ట్రాన్స్‌పోర్టింగు సీనరేజ్, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్, జిఎస్‌టిల కోసం మాత్రమే ఈ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు. జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ మన జిల్లా ఇసుక ఇతర రాష్ట్రాలకు రవాణా జరగకుండా తగిన భద్రతా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గనుల శాఖ డిడిరాజశేఖర్ మాట్లాడుతూ ఇసుక కోసం వచ్చే ప్రజలు ఆధార్ కార్డు జిరాక్స్ ఖచ్చితంగా తీసుకొని రావాలని సూచించారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మునిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ వర్ధంతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

భారత దేశ ప్రజల పక్షాన నిలిచి, పోరాట యోధునిగా పేరుగాంచిన బాబు జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతిని శనివారం ఎపి ట్రాన్స్‌కో అండ్ ఎంప్లాయిస్ కార్యాలయంలో ఈ టెక్నికల్ సుమిత్ర అధ్యక్షతన జరిగింది. సిబెళగల్ హుసేని మాట్లాడుతూ... మహనీయుల ఆశయాలకు అనుగుణంగా పనిచేయటమే వారికి మనమిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒఅండ్‌ఎంఎస్‌ఇ జి.బాబు రాజేంద్ర, ఎస్‌ఇ కన్‌స్ట్రక్షన్స్ కెవి. రామకృష్ణ పాల్గొని నివాళి ఘటించినారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎఎఒ రవికుమార్ మహిళా ఉద్యోగులు, కార్మికులు ఒప్పంద కార్మికులు పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్ : మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం డిసిసి కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. డిసిసి అధ్యక్షుడు కె.బాబురావు మాజీ మంత్రి మూలింటి మారెప్ప మాజీ ఎమ్మెల్యే పి.మురళీకృష్ణ, తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సామాన్య మధ్యతరగతి కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగి ఎన్నో ఉన్నత పదవులు చేపట్టిన ఓటమి ఎరుగని నాయకుడు అని కొనియాడారు. డిసిసి గౌరవ అధ్యక్షులు ఉండవెల్లి వెంకటన్న, డిసిసి కోఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ అనంతరత్నం మాదిగ, డిసిసి ఉపాధ్యక్షులు రియాజుద్దీన్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్, జిల్లా ఎస్‌సిసెల్ ఛైర్మన్ ఈ లాజరస్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎస్.ప్రమీల పాల్గొన్నారు.

వెల్దుర్తి : వెల్దుర్తి పట్టణంలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం వెల్దుర్తి మండల ఎంఆర్‌పిఎస్ నాయకులు నాయకంటి గిడ్డయ్య, జెడ్పిటిసి ఐజయ్య, బజారు, బజారు, మోష ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ గొప్ప సంఘసంస్కరణ కర్త, పోరాట యోధులని అన్నారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు, నాగరాజు, సూరిబాబు, పరమేశు, వెంకటేశ్వర్లు, సురేష్, పాల్గొన్నారు.



ఎపి ట్రాన్స్‌కో అండ్ ఎంప్లాయిస్ కార్యాయంలో నివాళులర్పిస్తున్న అధికారులు



కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

పింఛన్ల పండగ..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నూతన టిడిపి ప్రభుత్వం పెంచిన పింఛన్లను పంపిణీ చేయడంతో జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పండగ నెలకొంది. 11 కేటగిరీల పింఛన్‌దారులకు పెంచిన రూ.4వేల పింఛన్‌తో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలల బకాయి రూ.3వేలు కలిపి మొత్తం రూ.ఏడు వేలను అందించారు. వికలాంగులకు పెంచిన పింఛన్ రూ.6వేలను పంపిణీ చేశారు. సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ జిల్లాలో సాఫీగా సాగింది. కొన్ని ప్రాంతాల్లో సర్వర్ కాస్త సతాయించింది. రాత్రి ఏడు గంటల సమయానికి జిల్లావ్యాప్తంగా 91.97 శాతం మందికి పింఛన్ పంపిణీ పూర్తయింది. జిల్లాలో 2,45,229 మంది పింఛన్‌దారులు ఉండగా 2,25,534 మందికి పింఛన్ మొత్తాన్ని అందజేశారు. ఉదయం ఆరు గంటల నుంచే సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం 8 గంటల నుంచి 8.30 గంటల వరకూ అరగంట పాటు సర్వర్ మొరాయించింది. పత్తికొండ మండలంలో రెండు గంటల పాటు సర్వర్ రాలేదు. దీంతో పింఛన్‌దారులు, పంపిణీ సిబ్బంది సర్వర్ కోసం వేచి చూడాల్సి వచ్చింది. తొలి రోజు జిల్లాలో అత్యధికంగా గూడూరు మండలంలో 98.04 శాతం మందికి, అత్యల్పంగా కౌతాళం మండలంలో 81.78 శాతం మందికి పింఛన్ మొత్తాన్ని అందజేశారు. ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పథకం కింద నంద్యాల జిల్లాలో 2,21,240 మందికి పింఛన్‌దారులకు రూ.93.14 కోట్లు పింఛన్లను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు.

జాడ లేని భూసార కేంద్రాలు : రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే తొలుత వారి భూమి సారాన్ని తెలుసుకుని దానికి అనుగుణంగా పొలానికి పోషకాలను అందిస్తేనే సాధ్యం అవుతుంది. ఇందు కోసం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది భూసార పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. ఐదేళ్లుగా ఈ భూసార పరీక్షల జాడ లేకుండా పోయింది. ఖరీఫ్ ప్రారంభానికి ముందే ఈ భూసార పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా ఖరీఫ్ ప్రారంభమైనా ఇప్పటి వరకూ మట్టి నమూనాలను సేకరించలేదు. గతేడాది కేవలం మట్టి నమూనాల సేకరణ మాత్రమే చేశారు. ఆ నమూనాలను పరీక్షలు చేయడం పక్కన పెట్టేశారు. ఇదిలా ఉండగా ఉమ్మడి జిల్లాలో నాలుగు భూసార పరీక్షా కేంద్రాలు ఉండగా రెండు మాత్రమే పని చేస్తున్నారు. రెండు కేంద్రాలు ఏడాదికి పైగా పని చేయడం లేదు. కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు, కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో భూసార పరీక్షా కేంద్రాలు మాత్రమే పని చేస్తున్నాయి. నంద్యాల జిల్లాలోని నంద్యాల, డోన్ భూసార పరీక్షా కేంద్రాలు పనిచేయడం లేదు.

అవీ..ఇవీ..అన్నీ..

ఎన్‌టిఎను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కర్నూలు, నంద్యాల జిల్లాల వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ చేపట్టారు. కర్నూలులో బైక్ ర్యాలీ చేపట్టి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కర్నూలు జిల్లా ఆదోనిలో రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. గంట సేపు ట్రాఫిక్ స్తంభించింది. విద్యార్థి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మిగనూరులో ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. దేవనకొండ, నందవరం, ఆలూరులో విద్యా సంస్థల బంద్ చేపట్టారు. నంద్యాల జిల్లా నంద్యాల పట్టణంలో పద్మావతి నగర్ సర్కిల్ నుండి శ్రీనివాస్ సెంటర్ వరకు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ర్యాలీగా వెళ్లి రాస్తారోకో నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు రమేష్ నాయక్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌ఎండి రఫీ మాట్లాడారు. బండి ఆత్మకూరులో ర్యాలీ నిర్వహించారు. ఆత్మకూరు, పగిడ్యాల, బనగానపల్లె, ఆళ్లగడ్డ, నందికొట్కూరులోనూ బంద్ చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా డాక్టర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించు కున్నారు. వైద్యులను సన్మానించి అభినందనలు తెలిపారు.





ఎమ్మెల్యే జయ నాగేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న పత్తిఓబులయ్య , తదితరులు

నాటక రంగ సమస్యలు పరిష్కరిస్తా

-ఎమ్మెల్యే జయ నాగేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి -కర్నూల్ కల్చరల్

జిల్లాలోని నాటక రంగ సమస్యలు, కళాకారుల ఇబ్బందులు తనకు పూర్తిగా తెలుసునని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మధ్యాహ్నం కర్నూలులో టిజివి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య ఆధ్వర్యంలో కర్నూలు కళాకారులు ఆయనను కలిసి సన్మానించారు. కళారంగంలో వున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే జయ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి మాజీ మంత్రి బివి మోహన్ రెడ్డి తెల్లవారులు పౌరాణిక నాటకాలు చూసేవారని ఆ అలవాటును తనకు నేర్పించారని తెలిపారు. ప్రస్తుతం కళాకారుల వృద్ధాప్య పెన్షన్ పై రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి అర్హులైన వారికి ఇప్పించడానికి కృషి చేస్తానన్నారు. పేద కళాకారుల సమస్యలు తనకు తెలుసునని ఈ ప్రభుత్వంలో అవి పరిష్కారం అవుతాయని అన్నారు. ఓబులయ్యతో పాటు కళాకారులు గాండ్ల లక్ష్మన్న,సంగ ఆంజనేయులు, పిపిగురుమూర్తి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన ఎఆర్ ఎస్ఐని అభినందిస్తున్న ఎస్‌పి జి.కృష్ణకాంత్

మరిన్ని పతకాలు సాధించాలి

- ఎఆర్ ఆర్ఎస్ఐకి ఎస్‌పి అభినందనలు

-ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

జాతీయ పోలీసు జూడో క్లస్టర్ ఆటల పోటీల్లో రెండు కాంస్య పతకాలు సాధించిన కర్నూలు ఆర్మ్‌డు రిజర్వుడు ఆర్‌ఎస్‌ఐ పి.కల్పనను శనివారం జిల్లా క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ అభినందించారు. మరిన్ని పతకాలు సాధించాలని ప్రోత్సహించారు. గత నెల జూన్ 24 నుండి 30 వరకు అస్సాం రాష్ట్రం, గౌహతిలో అస్సాం పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన 9 వ జాతీయ పోలీసు జూడో క్లస్టర్ ఆటల పోటీల్లో ఆంధ్రప్రదేశ్ పోలీసు తరుపున కర్నూలు జిల్లా పోలీసుశాఖ నుండి ఆర్‌ఎస్‌ఐ పి. కల్పన పాల్గొని తైక్వాండోలో ఒక కాంస్యం, సిలాట్ పోటీల్లో ఒక కాంస్యం సాధించారు. ఈకార్యక్రమంలో ఆర్‌ఐలు నారాయణ, జావేద్, ఆర్‌ఎస్‌ఐలు పావని, రవిశంకర్, రామస్వామి ఉన్నారు.

సొంతూరులో ఎంపీకి ఘనస్వాగతం

పార్లమెంటు సమావేశాల తర్వాత తొలిసారి అడుగిడిన బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు ఎంపిగా ఎన్నికైన ఎంపి బస్తిపాటి నాగరాజు తొలిసారి పార్లమెంటు సమావేశాల్లో పాల్గొని జిల్లాలోకి అడుగుడిన సందర్భంగా ఆయన సొంతూరు పంచలింగాల గ్రామ ప్రజలు శనివారం ఘనస్వాగతం పలికారు. పంచలింగాల గ్రామం నుంచి తొలిసారి ఎంపీగా గెలిచిన నేపథ్యంలో స్థానిక గ్రామ ప్రజలు ఆయనను జీపులో ఊరేగిస్తూ బ్రహ్మరథం పట్టారు. పంచలింగాల చెక్‌పోస్టు వద్దకు ప్రజలు భారీ ఎత్తున చేరుకొని ఆయనకు గజమాలతో క్రేన్‌ను ఉపయోగించి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా టిడిపి జనసేన కార్యకర్తలు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. టిడిపి యువత భారీ ఎత్తున టిడిపి జెండాలను చేతబూని గ్రామంలో పూలవర్షం కురిపిస్తూ అడుగడుగునా బాణాసంచా కాల్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈ ర్యాలీకి ముందు భాగాన గురవయ్యలను నృత్యం బీరప్ప డోలు వాయిద్య బృందం ప్రదర్శించిన కళారూపాలు ర్యాలీకి ఆకర్షణగా నిలిచాయి. అనంతరం గ్రామంలోని ఆలయాలను దర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గ్రామంలో ఆయన రాకను పురస్కరించుకొని టిడిపి కార్యకర్తలు నాయకులు అడుగడుగునా కట్టిన భారీ స్వాగత బ్యానర్లు, ఫ్లెక్సీలతో గ్రామం పసుపుపయంగా మారింది. ర్యాలీ సందర్భంగా కర్నూలు తాలూకా సిఐ శ్రీధర్ భద్రత చర్యలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గ్రామ సర్పంచి కృష్ణ యాదవ్, టిడిపి నాయకులు రాజశేఖర్ రెడ్డి, జనసేన జిల్లా ప్రెసిడెంట్ హర్షద్, టిడిపి నాయకులు హుస్సేనయ్య, తెలుగు యువత మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.రామకృష్ణ, సుధాకర్, మాజీ ఎంపిటిసి ఆదాం, విష్ణువర్ధన్ రెడ్డి, రఫీక్, తదితరులు పాల్గొన్నారు.




ఎంపీ బస్తిపాటి నాగరాజుకు ఘనస్వాగతం పలుకుతున్న పంచలింగాల ప్రజలు

నాయకత్వంలో ఎడిపై వరల్డ్ స్కూల్ ఫస్టు

- ఘనంగానాయకత్వ బాధ్యతల స్వీకరణ వేడుక

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్ : నాయత్వంలో ఎడిపై వరల్డ్ స్కూల్ ముందుందని ఏడవ బెటాలియన్ కమాండెంట్ కల్నల్ జోబి ఫిలిప్ అన్నారు. శనివారం లక్ష్మీపురం ఏడిపై వరల్డ్ స్కూలు లో ఘనంగా విద్యార్థుల నాయకత్వ బాధ్యతల స్వీకరణ వేడుక నిర్వహించారు. ఈ వేడుకలలో ముఖ్య అతిధిగా పాల్గొన్న కల్నల్ జోబి ఫిలిప్ మాట్లాడుతూ విద్యార్థుల చిన్న వయసు నుంచే వారిలో గొప్ప వ్యక్తుల నాయకత్వ భావనలను అలవరుచుకోవడం చాలా ముఖ్యమని అభినందించారు. ఈ వేడుకలలో ఎడిపై వరల్డ్ స్కూల్ డైరెక్టర్లు డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ సతీష్ పాల్గొని విద్యార్థుల నాయకత్వ ప్రతిభను ప్రశంసించారు. ఎడిపై వరల్డ్ స్కూల్ ప్రిన్సిపల్ జోసెఫ్ డేవిడ్, ప్రిన్సిపల్ అడ్వైసర్ లక్ష్మి నాయర్ పాల్గొని స్కూల్ ఎన్నికలలో విజయం సాధించిన విద్యార్థులను సత్కరించి వారికి వారి వారి బాధ్యతలను అప్పగించారు.



నాయకత్వ బాధ్యతల స్వీకరణ వేడుకలో కల్నల్ జోబి ఫిలిప్



పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల స్నాతకోత్సవంలో అతిథులు, పుల్లయ్య, మోహన్‌కుమార్

ఆర్థిక క్రమశిక్షణ పురోగతికి తొలిమెట్టు

-జితేందర్ సింగ్ హెచ్ ఆర్ మేనేజర్ కాగ్నిజెంట్
-ఘనంగా పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల స్నాతకోత్సవం

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్ : ఆర్థిక క్రమశిక్షణతో అవలంబిస్తే జీవితం పురోగతివైపు సాధించడానికి తొలిమెట్టు అని కాగ్నిజెంట్ హెచ్‌ఆర్ మేనేజర్ జితేందర్ సింగ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం కర్నూలు జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో తృతీయ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కాగ్నిజెంట్ హెచ్‌ఆర్ మేనేజర్ జితేందర్ సింగ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నైపుణ్యం కలిగిన అభ్యర్థుల కోసం కంపెనీలు అన్నీ నిరంతరం వెతుకులాడుతున్నాయని గుర్తు చేశారు. మన మేధస్సును , మేధావులను కంపెనీలు కోట్ల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నాయన్నారు. కళాశాల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య మాట్లాడుతూ ఎంత ఎత్తు ఎదిగినా ఒదిగి ఉండే మనస్తత్వం మిమ్ములను ముందుకు నడిపిస్తుందన్నారు. కళాశాల ఛైర్మన్ జివిఎం.మోహన్ కుమార్ డిగ్రీ తీసుకుంటున్న విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. సామాజిక బాధ్యతను గుర్తించుకోవాలని చెప్పారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.శ్రీనివాసరావు ఈ సంవత్సరం చివరి సంవత్సరం చదివిన విద్యార్థులలో 90 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి పట్టాలు తీసుకున్నారని చెప్పారు. అనంతరం బ్రాంచీల వారిగా టాపర్లుగా నిలిచిన విద్యార్థినీ విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గవర్నింగ్ బాడీ సభ్యులు డాక్టర్ ఎన్. విశాలి, జి. గోపీనాథ్, జి.వంశీధర్, డాక్టర్ ఎం.గిరిధర్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలక్ష్మి ,కార్యక్రమ కన్వీనర్ ప్రొఫెసర్ జి.శశికుమార్, కళాశాల డీన్లు , వివిధ శాఖాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్లడ్ క్యాన్సర్ ప్రాణాంతకం కాదు

-సరైన చికిత్స అందిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చు
-డాక్టర్ గణేష్ జైషెత్వాల్, హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

బ్లడ్ క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధికాదని సరైన చికిత్స అందిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి డాక్టర్.గణేష్ జైషెత్వాల్ అన్నారు. ఈ మేరకు కర్నూలు పాతఈద్గ హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్.గణేష్ జై షేతాల్ వివరాలు వెల్లడించారు. ప్రపంచ రక్త మార్పిడి అవగాహన మాసం సందర్భంగా బ్లడ్‌క్యాన్సర్ పై పలు సూచనలు చేశారు. బ్లడ్ క్యాన్సర్‌లు లుకేమియా, లింఫోమా, మల్టిపుల్ మైలోమా అని మూడు రకాలుగా ఉంటాయని తెలిపారు. అన్ని రకాల బ్లడ్ క్యాన్సర్ బోన్‌మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ విధానంలో చికిత్స చేయవచ్చని చెప్పారు. యశోద ఆసుపత్రిలో 500 బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయగా 92 శాతం ఆపరేషన్లు విజయవంతం అయ్యాయని అన్నారు. కర్నూలు జిల్లాకు చెందిన ఇద్దరు పేషెంట్లుకు రక్తక్యాన్సర్ చికిత్స అనంతరం పూర్తిగా కోలుకున్నారని పేర్కొన్నారు. రక్త క్యాన్సర్‌తో పాటు ఎలాంటి క్యాన్సర్ వ్యాధులు రాకుండా ఉండాలంటే మంచి ఆహారం, ప్రతి రోజు వ్యాయామం, యోగా చేయాలని, జంక్‌ఫుడ్ తినకూడదని తెలిపారు. పేషెంట్ రాముడు మాట్లాడుతూ తనకు యశోద ఆసుపత్రిలో డాక్టర్ గణేష్ మంచి చికిత్స అందించినందుకు పూర్తిగా కోలుకున్నానని తెలిపారు. ఈ సమావేశంలో బాధితురాలు లీలావతి, పాల్గొన్నారు



మాట్లాడుతున్న యశోద హాస్పిటల్ డాక్టర్ గణేష్ జై షెత్వాల్

ఆర్గానిక్ సాగు రైతులతో ఐసిఎస్ బృందం సమీక్ష

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని ముడుమాల, పాలదొడ్డి, కొండాపురం తదితర గ్రామాల్లో సాగు చేస్తున్న ఆర్గానిక్ రైతులతో ఐసిఎస్ లోకన్ సంస్థ శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తుంగభద్ర సేంద్రియ ఎరువుల, విత్తనాల రైతు పరస్పర సంఘం సిబ్బంది వినోద్, ఉదయ్‌ల సమక్షంలో ఆడిటర్ గిరిబాబు ఈ సమీక్ష ఏర్పాటు చేయగా ఇందుకు ఐసిఎస్ సంస్థ మేనేజర్ లక్ష్మి పాల్గొని ఆర్గానిక్ పంటల సాగులపై అవగాహన కల్పించారు. దిగుబడి తక్కువైనను గిట్టుబాటు ధరలు ఆశించినంతగానే అందుకోవచ్చని సాగులు విస్తృతం చేయాలన్నారు.



ఆర్గానిక్ సాగు రైతులతో ఐసిఎస్ బృందం

ఎవరూ అధైర్య పడొద్దు

- ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

'మనకు మంచి రోజులు వస్తాయి. ఎవరూ అధైర్యపడవద్దు. వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటాన'ని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి తెలిపారు. శనివారం మండలంలోని దౌల్తాపురం గ్రామంలో వైసిపి యువ నాయకులు షేకన్నను ఎమ్మెల్యే విరుపాక్షి పరామర్శించారు. పార్టీ నుంచి వచ్చిన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత నెల 14న గుంతకల్లులో వైసిపి నాయకులు దౌల్తాపురం షేకన్నపై టిడిపి నాయకులు దాడి చేశారని తెలిపారు. షేకన్న తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. విషయాన్ని వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్పందించిన ఆయన తక్షణ సహాయం కింద రూ.50 వేల ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. వైసిపి జిల్లా అధ్యక్షులు సత్యనారాయణమ్మ ఆధ్వర్యంలో దౌల్తాపురం గ్రామంలో షేకన్నను పరామర్శించి చెక్కును అందజేసినట్లు తెలిపారు. ఏ గ్రామానికి వెళ్లినా, ఎక్కడికి వెళ్లినా తాము జగన్మోహన్ రెడ్డికి ఓటు వేశామని, ఇలా ఎందుకు జరిగిందని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, కుందనగుర్తి నాగప్ప, మండల మాజీ కోకన్వీనర్ లోకనాథ్, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, చిప్పగిరి ఉప సర్పంచి పెద్ద పెద్దయ్య, దౌల్తాపురం పెద్ద షేకన్న, కొండ రామకృష్ణ, దౌల్తాపురం దామోదర్, గోవిందు, సుంకన్న, వెంకటేష్, పెద్దయ్య, షేకన్న పాల్గొన్నారు.

రాంజల నీటిని శుద్ధి చేస్తాం : కమిషనర్

ప్రజాశక్తి - ఆదోని



మాట్లాడుతున్న కమిషనర్ రామచంద్రరెడ్డి

ప్రసిద్ధిగాంచిన రాంజల చెరువులోని నీటిని శుద్ధి చేసి పురవాసులకు త్వరలోనే తాగేందుకు సరఫరా చేస్తామని మున్సిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి తెలిపారు. శనివారం మున్సిపల్ ఇంజినీర్ వెంకట చలపతి రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్లు రాజశేఖర్ రెడ్డి, కృపాకర్‌తో కలిసి రాంజల చెరువులోని నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాంజల చెరువులోని నీరు ఎంతో శుద్ధి కలవని ఇక్కడి ప్రజల విశ్వాసమని తెలిపారు. 2021లో జరిగిన దేవర ఉత్సవంలో అపశ్రుతి చోటు చేసుకోవడంతో ఓ వ్యక్తి మృతి చెందారని చెప్పారు. రాంజల నీటిని సేవించడం వల్ల ఆ వ్యక్తి మరణించాడని అప్పట్లో నమ్మాల్సి వచ్చిందన్నారు. శాస్త్రీయంగా ఎలాంటి రుజువూ కాలేదన్నారు. అప్పటి నుంచి నిరుపయోగంగా మారిందని తెలిపారు. ఎమ్మెల్యే పార్థసారథి సూచన మేరకు రాంజలలో నిల్వ ఉన్న నీటిని బయటికి పంపే కార్యక్రమం మొదలు పెట్టామని చెప్పారు. చెరువులో సుమారుగా నీరు నిల్వ ఉందన్నారు. రోజూ ఏడు మోటార్లతో నీటిని తోడి బయటకు పంపిస్తున్నామని తెలిపారు. వర్షం వల్ల వచ్చిన నీటిని నిల్వ ఉంచి శుద్ధి చేసి పరీక్ష చేసిన తర్వాతే ప్రజలకు సరఫరా చేస్తామని తెలిపారు. చెరువు పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.

ఎరువులు, పురుగు మందుల

దుకాణాలపై విజిలెన్స్ దాడులు

- రూ.22 లక్షల విలువ చేసే విత్తనాలకు స్టాప్ సేల్

ప్రజాశక్తి - గోనెగండ్ల



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

గోనెగండ్లలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. మల్లికార్జున ట్రేడర్స్ రూ.1,33,650, లక్ష్మీనరసింహ ట్రేడర్స్ రూ.16,96,320, జై కిసాన్ ట్రేడర్స్ రూ.3,96,950 మొత్తం రూ.22,28,870 విలువ చేసే 46.10 వివిధ రకాల విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి కృష్ణా జిల్లా గన్నవరం ఎడిఎ శ్రీనివాసరావు మాట్లాడారు. షాపుల డీలర్లు తప్పకుండా షాపుల ముందు ధరల పట్టిక స్టాక్ బోర్డు పెట్టాలని తెలిపారు. ప్రతి రైతుకూ తప్పకుండా బిల్లు ఇవ్వాలని, ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు విక్రయించరాదని హెచ్చరించారు. ఎమ్మిగనూరు ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ హేమలత, కర్నూలు టెక్నికల్ ఎఒ దస్తగిరి పాల్గొన్నారు.

గోసంరక్షణ సేవకు రూ.లక్ష విరాళం

మంత్రాలయం : శ్రీమఠం నిర్వహణలో ఉన్న గో సంరక్షణ శాలకు భక్తుల నుంచి రూ.లక్ష విరాళం వచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. శ్రీరాఘవేంద్రస్వామి దర్శనార్థమై వచ్చిన కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన రక్షిత్ రణ్య అనే భక్తురాలు స్వామి దర్శనం అనంతరం రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు తెలిపారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు దాతలకు శేష వస్త్రం అందజేసినట్లు తెలిపారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

- నీతి అయోగ్ ప్రొఫెసర్ శ్రుతి అగర్వాల్

ప్రజాశక్తి - చిప్పగిరి

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నీతి అయోగ్ ముఖ్య లక్ష్యమని, నీతి అయోగ్ ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని కన్సల్టెంట్ ప్రొఫెసర్ (నీతి అయోగ్) శ్రుతి అగర్వాల్ తెలిపారు. శనివారం చిప్పగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నీతి అయోగ్ ద్వారా ప్రజల జీవన ప్రమాణాల అభివృద్ధికి సంబంధించి ఇండికేటర్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఎంపిడిఒ బరేన్ సాహెబ్, ఎంపిపి జూటూరు హేమలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ హై స్కూల్ నుంచి చిప్పగిరి బస్టాండ్ రోడ్డు మీదుగా అధికారులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కన్సల్టెంట్ ప్రొఫెసర్ శ్రుతి అగర్వాల్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 500 మండలాలను ఆపరేషన్ బ్లాక్ కింద (వెనుకబడిన మండలాల కింద) ఎంపిక చేసిందన్నారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో మద్దికెర, హోళగుంద, చిప్పగిరి మండలాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. చిప్పగిరి మండలంలో అధికారులతో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. వ్యవసాయం, స్త్రీ, శిశు సంక్షేమం, ఆరోగ్యంపై పూర్తి దృష్టిని సారించాలని తెలిపారు. మహిళలకు చిరుధాన్యాలు తీసుకుంటే వచ్చే దృఢ శక్తిని వివరించాలన్నారు. గ్రామాల్లో అధికారులతో కలిసి స్థానిక సర్పంచులు, ఎంపిటిసిలు కార్యక్రమంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. డిఆర్‌డిఎ పీడీ సలీం బాషా, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ సత్యవతి, డిఎల్‌డిఒ నాగేశ్వరరావు, సిడిపిఒ మద్దమ్మ, చిప్పగిరి ప్రభుత్వ డాక్టర్ అఫ్రోజ్ బేగం, ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్, తహశీల్దార్ పద్మజ, ఎంఇఒ సావిత్రి, ఎఒ జయలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న, ఎపిఒ మాధవ శంకర్, ఎపిఎం నాగార్జున, ఇన్‌ఛార్జీ ఇఒఆర్‌డి బాలన్న, వెలుగు సిసి లక్ష్మణ్, ఆపరేషన్ బ్లాక్ మండల కోఆర్డినేటర్ లక్ష్మీ నరసింహ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రుతి అగర్వాల్



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పండ్ల తోటల పెంపకంతో అభివృద్ధి

- సర్పంచి అరుణ్ కుమార్

ప్రజాశక్తి- దేవనకొండ

ఉపాధి హామీ చట్టం కింద ఉచితంగా అందిస్తున్న పండ్ల మొక్కలను రైతులు పొలాల్లో నాటుకొని అభివృద్ధి చెందాలని ఉపాధి హామీ ఏపీడీ ఫక్కీరప్ప తెలిపారు. శనివారం మండలంలోని తెర్నేకల్ సర్పంచి అరుణ్‌కుమార్ అధ్యక్షతన హార్టికల్చర్ పెంపకంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్న, సన్నకారు రైతులకు ఉపాధి హామీ చట్టం కింద వంద శాతం రాయితీతో ఇస్తున్న పండ్ల మొక్కలను వేసుకోవడానికి ముందుకు రావాలని కోరారు. హార్టికల్చర్ వల్ల రైతులు ఆర్థికంగా ఎదగడానికి ఎంతో దోహదం చేస్తుందని, పర్యావరణాన్ని రక్షించడానికి దోహదం చేస్తుందని తెలిపారు. ఎపిఒ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి రాముడు, మధు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచి అరుణ్ కుమార్



మాట్లాడుతున్న అంజిబాబు

రాజకీయ అవగాహన కలిగి ఉండాలి

- సిపిఎం జిల్లా నాయకులు అంజిబాబు

ప్రజాశక్తి - ఆదోని

దేశంలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిస్థితులపై కచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని సిపిఎం జిల్లా నాయకులు ఎమ్‌డి.అంజిబాబు తెలిపారు. శనివారం ఆదోని సుందరయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు. సిపిఎం పట్టణ సీనియర్ నాయకులు గోపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సిపిఎంను క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించేలా ప్రజలను చైతన్యం చేయాలని తెలిపారు. సిపిఎం సీనియర్ నాయకులు ఈరన్న, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు తిప్పన్న, ముక్కన్న, నాయకులు వీరేష్, వెంకటేష్, నాగరాజు, అజీంఖాన్, శ్రీనివాసులు, ఎక్బాల్, రాజు పాల్గొన్నారు.

10న ధర్నాను జయప్రదం చేయాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 10న దేశవ్యాప్తంగా కార్మికుల డిమాండ్స్ డే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు కోరారు. శనివారం సిఐటియు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను బిజెపి ప్రభుత్వం రద్దు చేసి నాలుగు కోడ్‌ల ద్వారా కార్మికులకు నష్టం వాటిల్లే విధంగా అమలు చేయడానికి ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. తక్షణమే బిజెపి ప్రభుత్వం నాలుగు కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు.



మాట్లాడుతున్న రామాంజనేయులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఆదోని

ఆర్‌ఎస్ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం ఆర్ట్స్ కళాశాల ఆవరణ ముందు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆ కళాశాల డైరెక్టర్ శివ రాముడు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ నరేష్ ఆచారి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆర్‌ఎస్ నర్సింగ్, పారా మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో బిపి, షుగర్, టెంపరేచర్, అధిక బరువు తదితర వాటికి పరీక్షలు నిర్వహించి రోగులకు కౌన్సెలింగ్ ఇప్పించామని చెప్పారు. తమ కళాశాలలో జిఎన్ఎం, జనరల్ నర్సింగ్, డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, డిప్లొమా ఇన్ మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ కోర్సులు ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఉచిత సీట్లకు ముందుగానే రిజర్వేషన్ చేసుకున్న వారికి ఇస్తామని తెలిపారు. తమ కళాశాల ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని పాత విశ్వ నారాయణ కళాశాలలో కొనసాగుతోందని తెలిపారు. ప్రిన్సిపల్ అనన్య వైష్ణవి, డాక్టర్ రాజు, సిబ్బంది హేమంత్, ప్రసన్న, ఆనంద్, శివప్రియ పాల్గొన్నారు.

ఆస్పరికి సాగు, తాగునీరందించాలి

- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - ఆస్పరి

జిల్లాలో అత్యంత వెనుకబడిన ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరి మండలానికి సాగు, తాగునీరు అందించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, వీరశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం ఆస్పరిలోని రామతీర్థం దగ్గర ఆస్పరి, దేవనకొండ మండలాల సమావేశం నిర్వహించారు. బాలకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వేదవతి ప్రాజెక్టును త్వరగా పూర్తిచేసి ఆస్పరి మండలానికి సాగు, తాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. నిత్యం కరువు బారిన పడుతూ ఉపాధి పనులు కోసం బెంగళూరు, హైదరాబాద్, గుంటూరు వంటి ప్రాంతాలకు కూలీలు వలస వెళ్తుంటారని తెలిపారు. మండలంలోని ప్రజలు గుక్కెడు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారని చెప్పారు. ఆస్పరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా మార్చాలని కోరారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సరిపడా విత్తనాలు 90శాతం సబ్సిడీతో అందించాలని, ఎరువులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కరువు నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ అందని రైతులందరికీ నష్టపరిహారం అందించాలని కోరారు. బ్యాంకుల్లో పంటల బీమాను వెంటనే రైతుల అకౌంట్‌లో జమ చేయాలని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని నాయకులను, కార్యకర్తలను కోరారు. సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు, నాయకులు రంగస్వామి, రామాంజనేయులు, రవి, మధు రెడ్డి, సుందర్ రాజు, సూరి, వీరేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆనంద్ బాబు

టెక్స్‌టైల్ పార్కు నిర్మాణాన్ని పూర్తి చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కు నిర్మాణాన్ని పూర్తి చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడారు. 2014వ సంవత్సరంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లాకు, ఎమ్మిగనూరు పట్టణానికి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కు నిర్మాణం పూర్తి చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కు నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, ఐటి విద్యాశాఖ మంత్రిగా ఉన్న టిజి.భరత్, నారా లోకేష్‌లు జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి, ముఖ్యంగా ఎమ్మిగనూరులో పరిశ్రమలు స్థాపించడానికి కృషి చేయాలని కోరారు. డివైఎఫ్ఐ పట్టణ నాయకులు సురేష్, నాని, రావితేజ, అభి, విజయ్, రాకేష్, గణేష్, చరణ్, కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలి

- జనసేన మండల కన్వీనర్ చంద్ర

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని చింతకుంట, బాపురం పంపు హౌస్ నుంచి గ్రామాలకు నీటిని శుద్ధి చేసిన సరఫరా చేయాలని జనసేన మండల కన్వీనర్ చంద్ర కోరారు. శనివారం ఇఒఆర్‌డి మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 45 గ్రామాలకు ఈ పంపు హౌస్ నుంచి నీరు సరఫరా అవుతోందని తెలిపారు. ఆయా గ్రామాలకు వదిలే నీటిని శుద్ధి చేయకుండా అలాగే సరఫరా చేయడం వల్ల ఆ నీరు తాగి ఆయా గ్రామాల ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారని చెప్పారు. వెంటనే అధికారులు స్పందించి నీటిని శుద్ధి చేసి గ్రామాలకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. జనసేన నాయకులు మల్లి, శీను, తిమ్మప్ప, బసవరాజు, పవన్, రాజశేఖర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బీవీని సన్మానిస్తున్న సంఘం నాయకులు

ఎమ్మెల్యే బీవీకి సన్మానం

ప్రజాశక్తి - నందవరం

ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డిని శనివారం నాయీ బ్రాహ్మణ సంఘం తరపున శాలువా, పూలమాల వేసి సన్మానించారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణులు రాష్ట్ర పార్లమెంట్ సభ్యులు కనకవీడు ప్రభాకర్, పొనకలదిన్నె రాజన్నలు మాట్లాడారు. గత ప్రభుత్వంలో నాయీ బ్రాహ్మణులకు ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పనులు జరిగాయని, అలాగే ఎమ్మెల్యే బీవీ కూడా నాయీ బ్రాహ్మణులకు చేదోడుగా ఉంటూ అన్ని విధాలుగా సహాయం అందించారని తెలిపారు. ఎమ్మెల్యే బీవీకి మద్దతుగా నిలుస్తామన్నారు. పెద్ద గోపాల్, దశరథ్, నాగేంద్ర, వీరేష్, రాఘవేంద్ర, గోపాల్, రాము, మునిస్వామి, వీరేష్, డాక్టర్ రాజు, నాగేష్, కోటేష్, పెద్ద నరసింహులు, చిన్న నరసింహులు, ఉరుకుందు, ఈరన్న, కృష్ణయ్య, చింతలయ్య, పెద్దయ్య, వెంకట్ రాముడు, శివ పాల్గొన్నారు.

జూనోటిక్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

- మండల పశు వైద్యాధికారి అశోక్ కుమార్

ప్రజాశక్తి - మంత్రాలయం

పెంపుడు జంతువులకు సోకే జూనోటిక్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ అశోక్ కుమార్ సూచించారు. శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రేబీస్ వ్యాధి సోకకుండా పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సుమారు 180 రకాల వ్యాధులు పశు, పక్ష్యాదులు, కుక్కల నుంచి మనుషులకు సంక్రమిస్తాయని చెప్పారు. పెంపుడు జంతువులు, పశు, పక్షులకు వచ్చే వ్యాధుల్లో రేబిస్, ఆంథ్రాక్స్, బ్రుసుల్లోసిస్, క్షయ, చర్మ వ్యాధులు ప్రమాదకరమని తెలిపారు. రేబిస్ వ్యాధి ప్రమాదకరమైందని, నిర్లక్ష్యం చేయకుండా వెంటనే టీకా వేసుకోవాలని సూచించారు. పెంపుడు జంతువులు, పశువులను తాకినప్పుడు శుభ్రంగా సబ్బుతో చేతులు కడుక్కోవాలని తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 20 కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు.

పోరాటయోధుడు జగ్జీవన్ రామ్

- టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దళితుల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించి హక్కుల కోసం పోరాడిన గొప్ప యోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న తెలిపారు. శనివారం పట్టణంలో ఎస్సీ కాలనీలో స్వాతంత్ర్య సమరయోధుడు, దళితుల ఆశాజ్యోతి, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 38వ వర్ధంతి నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ సమగ్రతకు, జాతి సమైక్యతకు కృషి చేసి భారత రాజ్యాంగానికి కావలాదారుడుగా వ్యవహరించి, అణగారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించారని తెలిపారు. జగ్జీవన్ రామ్ పేరిట ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2014-19లో ఎస్సీ, ఎస్టీల ఉచిత విద్యుత్ పథకానికి జగ్జీవన్ జ్యోతిగా నామకరణం చేశారని చెప్పారు. టిడిపి ఎస్సీ కాలనీ సీనియర్ నాయకులు, విద్యా కమిటీ మాజీ ఛైర్మన్ రోజా ఆర్ట్స్ ఉసేని, టిడిపి నాయకులు సప్లయర్స్ బంగారప్ప, ఎస్.సాల్మన్, అల్వాల ప్రసాద్, జగతాప్ జై పాల్, పందికోన సురేష్, టి.ఈరన్న, సందెపోగు రామన్న, ఎల్లప్ప, కదిరికోట ప్రభుదాసు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని కెవిపిఎస్ కార్యాలయంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి చెన్నప్ప అధ్యక్షతన జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మామిడికాయల రాజు, చర్మకార వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి, కెవిపిఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు తిమ్మన్నచ చిన్నప్ప, నాయకులు గంగన్న, గుంటప్ప, మనోహర్, లాజర్ పాల్గొన్నారు. అలాగే వైసిపి ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ వర్ధంతి నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు, పట్టణ అధికారి ప్రతినిధి సునీల్ కుమార్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు అబ్రార్, కౌన్సిలర్లు డిష్ కేశవరెడ్డి, ఎంకె.శివప్రసాద్, ఇన్‌ఛార్జీలు సోమేష్, చంద్రశేఖర్, నాయకులు మహబూబ్ బేగ్, షేక్ చాంద్, ప్రభాకర్, కొండాపూర్ హుస్సేన్ పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలో పెద్ద మాదిగేరిలో జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి జిల్లా నాయకులు బండారి హనుమంతు మాదిగ ఆధ్వర్యంలో ఎంఆర్‌పిఎస్ ఆదోని టౌన్ కన్వీనర్ వన్నెల మణికంఠ మాదిగ, టౌన్ నాయకులు నరసింహ మాదిగ అధ్యక్షతన జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బండారి ఈరన్న మాదిగ, బండారి మార్కండేయ మాదిగ, బండారి ఎల్లప్ప మాదిగ, రామాంజి, అర్జున్, లక్ష్మన్న, రాఘవేంద్ర, వినోద్ కుమార్, రఘు, శివ, గోపి, లక్ష్మన్న పాల్గొన్నారు. **మంత్రాలయం**లోని ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కెవిపిఎస్, జైభీమ్ ఎంఆర్‌పిఎస్, నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్, ఎంఆర్‌పిఎస్ నాయకులు జయరాజు, హనుమన్న, అమ్రేష్ మాదిగ, నరసింహ పాల్గొన్నారు. **గోనెగండ్ల**లో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గంజహళ్లి పసెద్దుల మహదేవ్ మాదిగ, నాయకులు ఎ.సెంటర్ నాగేశ్వరరావు, విజయ్, యనకండ్ల వెంకటరాముడు, గాజులదిన్నె సీమోను, గోనెగండ్ల రంగన్న, హెచ్.కైరవాడి దస్తగిరి పాల్గొన్నారు. **నందవరం** పంచాయతీ ఆవరణలో జై భీమ్ ఎంఆర్‌పిఎస్ మండల ప్రధాన కార్యదర్శి శవాల శాంతిరాజు ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షులు శవాల బుజ్జి బాబు మాదిగ, మండల కన్వీనర్ శవాల సత్యానందం, మండల నాయకులు శవాల భాస్కర్, మాచాపురం గ్రామ అధ్యక్షులు సప్పోగు దేవ సహాయం, చిన్న రాజు, నందవరం గ్రామ నాయకులు శవాల దావీదు, పరంపోగు సురేష్, శవాల ఆదాము, గంధాలం వసంత్, గంధాలం తాయన్న, గంధాలం జయరాజ్, సాతర్ల పృథ్వీరాజ్, ఉసేని, సాతర్ల దుబ్బన్న, మాచాపురం జయరాజ్ పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు



ఎమ్మిగనూరులో నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

అధికార లాంఛనాలతో రమేష్ అంత్యక్రియలు

- ఎస్ఐ గోపినాథ్

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ రమేష్ అంత్యక్రియలు అధికార లాంఛనాలతో నిర్వహించినట్లు ఎస్ఐ గోపినాథ్ తెలిపారు. మంత్రాలయం పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రమేష్ అనారోగ్య కారణాలతో సెలవుల్లో ఉంటూ కర్నూలు ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారని తెలిపారు. శనివారం ఆదోనిలో అంత్యక్రియలు జరిగాయని చెప్పారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



అంత్యక్రియలు నిర్వహిస్తున్న సిబ్బంది

పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కోసిగి

ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఈరన్న, కె.లక్ష్మన్న డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని స్థానిక ఎంఇఒ కార్యాలయంలో ఎంఇఒ-2 నాగేశప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో అనేక పాఠశాలల్లో ఎండిఎం తంబ్ సమస్య, రైస్ ఇండెంట్ కోసం తీవ్ర స్థాయిలో ఉందని తెలిపారు. మండలంలో అనేక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. అధికారులు స్పందించి తక్షణమే విద్యా వాలంటీరును నియమించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

నూతన విద్యావిధానంతో ప్రభుత్వ విద్య నాశనం

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా

ప్రజాశక్తి - ఆలూరు

కేంద్ర ప్రభుత్వం సంస్కరణల పేరుతో జాతీయ నూతన విద్యావిధానాన్ని (ఎన్ఇపి) తీసుకు రావడంతో ప్రభుత్వ విద్యా నాశనం అవుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా తెలిపారు. శనివారం ఆలూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతీయ నూతన విద్యావిధానం (ఎన్ఇపి)తో పర్యావసానాలు రాష్ట్ర విద్యారంగంలో స్పష్టంగా కనబడుతున్నాయని తెలిపారు. గడిచిన 25 ఏళ్లుగా దేశంలో అమలు చేస్తున్న విద్యావిధానాలతో, విద్య నుంచి ప్రభుత్వాలు నెమ్మదిగా తప్పుకోవడంతో విద్య ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ జరిగిందన్నారు. ఇప్పుడు ఎన్ఇపిని అమలు చేయడం ద్వారా మతతత్వం జోడించి విద్యను ప్రమాదంలోకి నెడుతున్నారని తెలిపారు. విద్యలో అసమానతలు పెరుగుతూ పేదల చదువులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మైనా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఇపిలో ఉన్న అంశాలన్నింటినీ వేగంగా అమలు చేస్తోందన్నారు. గతేడాదిలో ప్రారంభమయిన ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాల నుంచి ఒక్కో అంశాన్ని పరిశీలిస్తే పబ్లిక్, ప్రయివేట్ భాగస్వామ్యం, డిజిటల్ బోధన, వర్కు సర్దుబాటు, ఒకే మీడియానికి పరిమితం చేయడంతో పాటు, రేషనలైజేషన్ పేరుతో వేలాది పాఠశాలలను మూసివేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల మూసివేతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఇపిని అమలు చేస్తూ విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కళాశాల కార్యదర్శిగా కృష్ణ కిరణ్, అధ్యక్షులుగా హనుమంతు, సహాయ కార్యదర్శులుగా యశ్వంత్, గణేష్, స్టీఫెన్, ఉపాధ్యక్షులుగా ముంజునాథ్, ఖాజా, ఉదయ్, కమిటీ సభ్యులుగా భరత్, నంద కిషోర్, ఉచ్చీరంగ, జశ్వంత్, రంగస్వామి, గురు రాజాశేఖర్ ఎన్నికయ్యారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు గోవర్ధన్, మండల సహాయ కార్యదర్శి గిరిమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా